


బంగారపు బొట్లు సమర్పణ

శ్రీకాకుళం(ఘంటసాల): ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామికి తెనాలి మండలం చినరావూరుకి చెందిన వి.నిరంజన్‌రావు దంపతులు బంగారపు బొట్లు సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 916 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో భక్తులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌కు ఎస్‌ఆర్‌ఎం విద్యార్థిని

400 మీటర్ల రిలే పరుగు పోటీకి జ్యోతికశ్రీ ఎంపిక



మంగళగిరి: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌కు ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయం విద్యార్థిని దండి జ్యోతికశ్రీ ఎంపికైంది. 400 మీటర్ల రిలే పరుగుపందెంలో సత్తా చాటేందుకు ప్యారిస్ వెళ్లింది. అమరావతిలోని యూనివర్సిటీలో జ్యోతికశ్రీ ఇటీవలే ఫస్ట్ ఇయర్ బీఏ కోర్సులో ప్రవేశం పొందింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆమె ఇప్పటికే అంతర్జాతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. 2021 ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఇండియన్ నేషనల్ క్రీడా పోటీలలో ఉమెన్స్ (అండర్ – 23 కేటగిరి)పరుగు పందెంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అంతర్జాతీయ క్రీడా పోటీలలో పాల్గొని భారత్ జట్టు తరఫున అనేక పతకాలను పొందిన జ్యోతికశ్రీ ఒలింపిక్స్‌లోనూ సత్తాచాటుతుందని యూనివర్సిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. తన సత్తా చాటుతుందిన యూనివర్సిటి నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జ్యోతిక శ్రీని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ పరాశర్లు అభినందించారు.

జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు జిల్లాలో ఎనిమిది ప్రదేశాల్లోని 22 ప్రత్యేక కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3386 మందికి 3842 కిలోల కందిపప్పు, 1077మందికి 15,694 కిలోల బీపీటీ బియ్యం విక్రయించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం స్టీమ్డ్ ఫైన్ రకం బియ్యం కిలో రూ.55.85 ఉండగా రూ.49లకు, రా రైస్ ముడి రకం బియ్యం కిలో రూ.52.40 ఉండగా రూ.48లకు, దేశవాళీ కందిపప్పు రూ.174 ఉండగా రూ.160లకు అందజేస్తున్నామన్నారు. ఏమైనా అవకతవకలు జరిగినట్లు భావిస్తే జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి 91549 59287 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్రతి సభ్యురాలి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ముప్పాళ్ల: గ్రామ సమైఖ్యలో ఉన్న ప్రతి సభ్యురాలి వివరాలను జాతీయ గ్రామీణ లైవ్లీవుడ్ మిషన్ సైట్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలునాయక్ చెప్పారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామసమాఖ్యల సభ్యుల(వీ.ఓ.ఏ)తో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలునాయక్ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నటువంటి ప్రతి సభ్యురాలికి సంబంధించిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డుతో పాటుగా ఆర్థికపరమైన విషయాలన్నీ సంబంధిత యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం వెయ్యి గ్రూపులకుగాను ఇంకా 296 గ్రూపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఎం శ్రీనివాసరావు, లీగల్ కోఆర్డినేటర్ కనకారావు, ఏపీఎం బాలస్వామి, సీసీలు నాగరాజు, ఆయా గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

ఉద్యాన సహాయకుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



గిద్దల ఆంజనేయులు, అధ్యక్షుడు



వేము ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి

నరసరావుపేటరూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులుగా గిద్దల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా చింత గోపినాథ్ యాదవ్, ప్రధానకార్యదర్శిగా వేము ఏసురత్నం, సంయుక్త కార్యదర్శిగా జంపాల ప్రసాద్, కోశాధికారిగా వినయ్‌కుమార్, ఓమెన్ వెల్ఫేర్ కార్యదర్శిగా కరుణకుమారిలను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం పని చేస్తుదని కార్యవర్గ సభ్యులు తెలిపారు. సంఘం సభ్యులుగా కలగోట్ల రామకోటిరెడ్డి, గాలం యతేంద్ర నాగరాజు, ముప్పా గురునాధం, చింతలపూడి రాజేశ్వరిలు ఉన్నారు.

నీరు పారదు... సాగు సాగదు



ఆకురాజుపల్లి మేజర్ కాలువలో విస్తారంగా పెరిగిన పిచ్చిచెట్లు

"నాన్నా అందరి ఆకలి తీరుస్తున్నావ్..నీకు కష్టమొస్తే ఎవరున్నారు" అంటూ ఓ రైతును కుమార్తె అడిగే మాట. కానీ నిజ జీవితంలో కూడా రైతు పరిస్థితి అలాగే ఉంది. రైతు సమస్య పట్టడంలేదు. దుక్కి దున్నిన దగ్గర నుంచి చినుకు కోసం ఎదురుచూపులు. కాలువల్లో నీరు వస్తుందో రాదో తెలియని పరిస్థితి. కనీసం సాగు నీరైనా అందుతుందా అంటే అదీ లేదు. కాలువలు దెబ్బతిన్నాయి. వాటిని బాగు చేసేవారు లేరు. దీంతో సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- అధ్వానంగా పంట కాలువలు
- తంగెడ, ఆకురాజుపల్లి, రామాపురం మేజర్ కాలువల్లో పెరిగిన పూడిక, పిచ్చిచెట్లు
- కాలువల్లో పారుదలకు అటంకాలు
- మరమ్మతులు చేపట్టకపోతే కష్టమే..
- 83వేల ఎకరాల్లో పంట సాగు ప్రశ్నార్థకం

రైతుకు సాగునీటి కష్టాలు



అధ్వానంగా దాచేపల్లి పంట కాలువ

దాచేపల్లి : ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటకు సాగునీరు సకాలంలో అందక రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సాగునీరు అందించే మేజర్ కాలువలు, పంట కాలువలు పూడిక, పిచ్చిచెట్టలతో నిండిపోయాయి. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి సాగునీరు విడుదల చేస్తే మేజర్, మైనర్, పంటల కాలువల ద్వారా పంటలకు నీరు అందే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించటం లేదు. ఏ పంట కాలువ చూసినా ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు, జమ్ము, తామర ఆకు అల్లుకుపోయి కనిపిస్తుంది. సాగర్ ప్రాజెక్ట్ నిండితే కుడి కాలువ ద్వారా సాగునీరు విడుదల చేసే అవకాశం ఉన్నది. మేజర్, మైనర్, పంట కాలువల్లో పూడికతీత పనులు చేసి పిచ్చిచెట్లు తొలగించకపోతే సూమారుగా 83 వేల ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్న అన్నదాతల పరిస్థితి అయోమంగా మారుతుంది.

అధ్వానంగా పంట కాలువలు

పంట కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. తంగెడ మేజర్ కాలువ పరిధిలో 34వేల ఎకరాలు, ఆకురాజుపల్లి మేజర్ కాలువ పరిధిలో 25వేల ఎకరాలు, రామాపురం మేజర్ కాలువ పరిధిలో 24వేల ఎకరాల్లో రైతులు ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. ఈ మేజర్ కాలువల కింద రైతులు పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, మినుము, పెసర, దోస పంటలను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభం కావటంతో సూమారుగా 52 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆడపాదడపా తేలికపాటి వర్షాలు కురుస్తుండటంతో పంటల సాగుకు కొంతమేర ఇబ్బంది లేకుండా ఉన్నది. వర్ష కాలం ముగిసిన తరువాత పంట కాలువల ద్వారా వచ్చే సాగునీరే ఈ పంటలకు ఆధారం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి జలవనరుల శాఖ అధికారులు మేజర్, మైనర్, పంట కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. కాలువల్లో ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు, పూడిక తీత పనులు చేయకుండా ఉన్నారు. కాలువల్లో పిచ్చిచెట్లు పెరగటంతో పాటుగా కొన్నిచోట్ల కోతకు గురైంది. వీటికి కూడా మరమ్మతులు చేపట్టకపోవటంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

కాలువ (మేజర్)	సాగు విస్తీర్ణం (ఎకరాలు)
తంగెడ	34వేలు
రామాపురం	24వేలు
ఆకురాజుపల్లి	25వేలు
మొత్తం	83వేలు

గత ప్రభుత్వ హయాంలో రూ.1.75 కోట్లు ఖర్చు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.75 కోట్లు మంజూరుచేసి సకాలంలో మేజర్ కాలువలకు మరమ్మతులు చేపట్టింది. చివర భూములకు సాగునీరు అందింది. ఇప్పటికైనా అధికారులు సకాలంలో స్పందించి పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

చివరకు అందేనా!

తంగెడ, ఆకురాజుపల్లి, రామాపురం మేజర్ కాలువల పరిధిలోని ఆయకట్టు చివర భూముల రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది. కాలువల్లో పూడికతీసి, పిచ్చిచెట్లను తొలగిస్తే చివర భూములకు సాగునీరు అందటం అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ ఏడాది కాలువల్లో కనీస మరమ్మతులు చేపట్టకపోవటంతో చివర భూముల్లో సాగు చేస్తున్న రైతులు సాగునీటి కోసం కాలువలపై యుద్ధం చేయాల్సిన పరిస్థితి కన్పిస్తుంది.



తంగెడ మేజర్ కాలువలో పెరిగిన జమ్ము, పిచ్చిచెట్లు

మరమ్మతులు చేపట్టాలి



రెండు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా. మరో మూడు ఎకరాల్లో మిరప పంటను సాగు చేసేందుకు అన్ని సిద్ధం చేసుకున్నా. నేను సాగు చేస్తున్న భూములకు 28వ పంట కాలువల నుంచి సాగునీరు అందాల్సి ఉంది. ఈ కాలువలో పిచ్చి చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. సాగర్ డ్యాం నిండి కాలువలకు నీరు వదిలి పెట్టిన పిచ్చి చెట్లు పెరిగి ఉండటం వలన చివర భూములకు సాగునీరు అందటం కష్టంగా ఉంటుంది. కాలువల్లో మరమ్మతులు చేసి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

కొమ్ము బుజ్జి, రైతు, దాచేపల్లి

చివరి భూములకు నీరందించాలి



తంగెడ మేజర్ కాలువ పరిధిలోని చివర భూములకు సాగునీరు అందించాలి. ఈ ఏడాది 8 ఎకరాల్లో పత్తి, 4 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నాను. చివర భూములకు సాగునీరు అందించకపోతే మేము చాలా నష్టపోతాం. మేజర్ కాలువల్లో పూడిక తీసి చివర భూములకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకుని రైతులకు అండగా ఉండాలి.

–ఉప్పుతల యల్లయ్య, తంగెడ

ప్రతిపాదనలు పంపించాం



తంగెడ, ఆకురాజుపల్లి మేజర్ కాలువల్లో రూ.1.50 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీసి పిచ్చి చెట్లు తొలగిస్తాం. సాగునీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–దాసరి నర్సయ్య, జలవనరులశాఖ ఏఈ, దాచేపల్లి.

రషీద్ హత్యకేసులో అసలు దోషులేరీ..?

- కేసును నీరుగారుస్తున్న పోలీసులు
- ప్రభుత్వ ఒత్తిడితో రాజకీయ హత్యను వ్యక్తిగత కక్షగా మార్చేందుకు కుట్ర
- ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, షమీమ్, ఆయూబ్‌ల పేర్లు ఎఫ్‌ఐఆర్‌లో చేర్చని పోలీసులు
- హత్యకు కుట్రపన్నిన టీడీపీ కీలక నేతలు పరారీలో ఉన్నా పట్టించుకోని వైనం
- హంతకుడు వెంట ఉన్న టీడీపీ గూండాలను మాత్రమే అరెస్ట్ చూపిన పోలీసులు
- పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రషీద్ తల్లిదండ్రులు



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి లీలావతికి కేక్ తినిపిస్తున్న నిందితుడు జిలానీ (ఫైల్)



ABN ఆంధ్రజ్యోతి

వైసీపీ, టీడీపీ వర్గాలపై కేసు నమోదు

రషీద్ హత్య కేసులో అరెస్ట్ అయిన జిలానీ, సిద్ధిక్‌లు టీడీపీ వారే అని గతంలో ఆంధ్రజ్యోతి రాసిన వార్త క్లిప్

సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వినుకొండ వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్ హత్యను ప్రభుత్వం నీరుగారుస్తోంది. రాజకీయ ప్రతీకార హత్య అయినప్పటికీ వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. మృతుడి రక్త సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదులోని నిందితుల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చకుండా నామమాత్రంగా కొందరిని అరెస్ట్ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందన్న విమర్శలు బాధిత కుటుంబం నుంచి వ్యక్తమవుతున్నాయి. హత్య జరిగిన రోజే రషీద్ సోదరుడు ఖాదర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదులో రషీద్ మరణానికి కారణంగా పేర్కొంటూ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ మున్సిపాలిటీకి చెందిన కీలక టీడీపీ నేతలు షమీమ్‌ఖాన్, అయూబ్‌ఖాన్, హంతకుడు జిలానీ స్నేహితులైన కొందరు టీడీపీ రౌడీల పేర్లు ప్రస్తావించారు. అయితే పోలీసులు కేవలం హత్యలో పాల్గొన్న టీడీపీ గూండాల పేర్లు మాత్రమే పొందుపరచి, హత్యకు కుట్ర పన్నిన ప్రజాప్రతినిధులు, పట్టణ టీడీపీ ముఖ్యనేతల పేర్లు తొలగించారు. దీనిపై తొలిరోజు నుంచి రషీద్ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హత్యకు కుట్ర పన్నిన వారిని పక్కకు తప్పించి ఇది కేవలం వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్నారు.

హత్యలో పాల్గొన్న టీడీపీ గూండాలు అరెస్ట్

రషీద్ హత్య కేసులో ప్రధాన నిందితుడు జిలానీని ఇప్పటికే అరెస్ట్ చేయగా, హత్యతో సంబంధం ఉన్న మరో ఆరుగురిని పోలీసులు గురువారం అరెస్ట్ చూపారు. ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులు జిలానీ కూడా టీడీపీకి చెందిన వారే. ఈ ఏడాది జనవరి 17న ప్రచురితమై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వీరంతా టీడీపీ కార్యకర్తలని, వారిపై వినుకొండలో జరిగిన ఓ దాడి కేసులో కేసు నమోదు చేశారని వార్త రాశారు. గురువారం అరెస్ట్ అయిన ఒక్కొక్కరిపై అనేక క్రిమినల్ కేసులు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. వీరంతా పక్కా పథకం ప్రకారం రెక్కీ నిర్వహించి హత్య ఉదంతాన్ని ముగించారు. మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేసే రషీద్ ఎప్పుడు బయటకు వస్తాడో, ఎలా వెళ్తాడు అనేది వారం ముందు నుంచే జిలానీ, అతని అనుచరులు అక్కడ సంచరిస్తూ ఆరా తీశారు. హత్య జరిగిన ప్రాంతంలో పలు దుకాణాల వద్ద లభ్యమైన సీసీ పుటేజీల్లో ఈ విషయం వెల్లడైనట్టు పోలీసులు చెబుతున్నారు. రషీద్‌ను పాశవికంగా హత్య చేస్తున్న సమయంలో హంతకుడు జిలానీ అనుచరులు ఒక వలయంగా ఏర్పడి పహారా కాశారు. కొందరు హత్యకు ముందు మారణాయుధాలను అందించారు.

పోలీసులపై తీవ్ర ఒత్తిడి?

రషీద్ హత్య కేసులో తెరవెనుక కీలకంగా వ్యవహరించిన షమీమ్‌ఖాన్, అయూబ్‌ఖాన్‌లను ఎలాగైనా కేసు నుంచి తప్పించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పోలీసులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్టు తెలియవచ్చింది. ఈ ఒత్తిడితో తాను న్యాయం చేయలేకపోతున్నానంటూ ఓ పోలీసు అధికారి బాధిత కుటుంబానికి చెప్పి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేసులో వీరిద్దరిని అరెస్ట్ చేస్తే టీడీపీ ప్రతిష్ట దెబ్బతింటుందని అందుకు వారిద్దరిని అరెస్ట్ చేయకుండా చూడాలని పోలీసు శాఖలో ఓ ఉన్నతాధికారిని ఎమ్మెల్యే కోరినట్టు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.

మాజీ ముఖ్యమంత్రి డిమాండ్ చేస్తున్నా...

తన పార్టీ క్యారకర్త రషీద్ హత్యను జీర్ణించుకోలేని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు మనో ధైర్యం చెప్పారు. నిందితుడు జిలానీ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు సతీమణి లీలావతికి కేక్ తినిపిస్తున్న ఫొటోలు వైఎస్ జగన్‌కు చూపి తమ పార్టీ వాడు కాదని టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మృతుడి తల్లిదండ్రులు ఎండగట్టారు. అయినప్పటికీ పోలీసులు ఆ దిశగా ఎందుకు విచారణ చేపట్టడం లేదని బాధితులు వాపోతున్నారు. రషీద్ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని దేశ రాజధాని వేదికగా వైఎస్ జగన్ నిలదీశారు. ప్రభుత్వం, పోలీసులు మాత్రం ఈ కేసును వ్యక్తిగత కక్షలతో అని అర్థం చెప్పేలా ప్రయత్నిస్తున్నాయి.

అజ్ఞాతంలో అసలు నిందితులు

రషీద్ హత్యకు కుట్ర పన్నారంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న షమీమ్ ఖాన్, ఆయూబ్ ఖాన్‌లు హత్య జరిగిన రోజు నుంచి వినుకొండ నుంచి పారిపోయినట్టు సమాచారం. రషీద్ హత్యకు కథ, స్క్రీన్‌ప్లే మొత్తం షమీమ్, అయూబ్‌ఖాన్‌లే రచించారనదే వినుకొండలో అందరినోటా వినిపిస్తోంది. ప్రధాన నిందితుడు జిలానీ, షమీమ్, అయూబ్ ఖాన్‌లపై ఈ ఏడాది జనవరిలో షాదీఖానా వద్ద జరిగిన గొడవలో నిందితులుగా ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా వీరు ముగ్గురి మధ్య సంత్సనసంబంధాలు ఉన్నాయి. హత్యానంతరం వీరిద్దరు అజ్ఞాతంలో ఉండి తమ ఫోన్లను స్విచ్‌ఆఫ్ చేసి మారు నెంబర్లతో మాట్లాడి రషీద్ హత్యకేసులో నిందితులను పోలీసులకు అప్పగించడంలో కీలకపాత్ర పోషించారు. దీనికి ప్రతిఫలంగా కేసు నుంచి వీరి ఇరువురు పేర్లు తప్పించేందుకు ఒప్పందం కుదిరిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. హత్యతో సంబంధం లేకపోతే వీరు పారిపోవాల్సిన అవసరమేముంది? పరారైన నిందితులు ఆశ్రయం కోసం వీరి వద్దకు ఎందుకు వెళ్లారనే ప్రశ్నలు బాధిత కుటుంబం నుంచి వినిపిస్తున్నాయి. చిన్నచిన్న కేసుల్లో నానా హడావుడి చేసే పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న షమీమ్, ఆయూబ్‌లను అరెస్ట్ చేయడంలో అలసత్వం వహించడం పోలీసుశాఖ పనితీరుకు అద్దం పడుతోంది.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ఎస్పీ కె.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేటఈస్ట్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల హాస్టల్‌లో ఎన్‌సీసీ సీనియర్ క్యాడెట్స్ జూనియర్‌లను ర్యాగింగ్ చేసిన ఘటనపై పోలీస్‌శాఖ స్పందించింది. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ అధ్యాపకుల బృందంతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నవసమాజ నిర్మాణంలో కీలకపాత్ర వహించే అధ్యాపకులు ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు (డ్రగ్స్)కు వ్యతిరేకంగా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. నామమాత్రంగా యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ కమిటీలను ఏర్పాటు చేయటం వలన మంచి ఫలితాలు రావని, కమిటీల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని కోరారు. మద్యం, మాదకద్రవ్యాల వినియోగం వలన యువత నిర్వీర్యం అవుతున్నదీ విద్యార్థులకు స్పష్టంగా తెలియచేయాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిసలైన ఎందరో విద్యార్థులు ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతూ తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యాసంస్థలలో బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. విద్యాసంవత్సరం మధ్యలో ఇతర కళాశాలల నుంచి వచ్చే విద్యార్థుల గతాన్ని పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రవేశం కల్పించాలని సూచించారు. న్యాయమూర్తులు, పోలీస్‌శాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో తరచూ సమావేశాలను ఏర్పాటుచేయటం ద్వారా చట్టాలపై అవగాహన, సమాజం పట్ల బాధ్యత విద్యార్థులలో పెరుగుతుందని తెలిపారు. మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతను, సమాజాన్ని చైతన్యపరిచేలా రెండు నిమిషాల నిడివితో రీల్స్ చేయాలని, ఉత్తమమైన వాటికి బహుమతులు అందిస్తామని తెలిపారు. ఏఎస్పీలు రాఘవేంద్ర, లక్ష్మీపతి పాల్గొన్నారు.

'ఇసుకె'త్తిపోతున్నాం

కొల్లిపర: ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కొంత మంది టీడీపీ, జనసేన నాయకులు హల్‌చల్ చేస్తున్నారని, అధికారులతో పనిలేకుండా వారికి ఇష్టం వచ్చిన వారికి టోకెన్ స్లిప్‌లు ఇస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని వాహనదారులు, ఇసుక కోసం వచ్చిన వారు జేసీ బార్గవ్‌తేజ మొరపెట్టుకున్నారు. శుక్రవారం కొల్లిపర, మున్నంగితోపాటు తాడేపల్లిలోని ఇసుక స్టాక్ పాయింట్లను జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. డిజిటల్ చెల్లింపు విధానం అమలుపై ఆరా తీశారు. వాహనదారులను, ఇసుక కోసం వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పలువురు వాహనదారులు సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్టాక్ పాయింట్ వద్ద ఉన్న అధికార కూటమి నాయకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు కూడా నాయకులకు వంత పాడుతున్నారని విమర్శించారు. స్పందించిన జేసీ ఇక నుంచి ఇసుక సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడ ఉన్న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఏపీఎం ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వాహనదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జేసీ భార్గవ్‌తేజ

అడవులను క్రయ, విక్రయాలు చేస్తే ఉపేక్షించేది లేదు

జిల్లా అటవీ శాఖ అధికారిణి నీలిమాదేవి

పిడుగురాళ్ల: అడవులను క్రమ, విక్రయాలు చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా అటవీ శాఖ అధికారి నీలిమాదేవి అన్నారు. పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అనంతరం మండలంలోని గుత్తికొండ అటవీ భూములను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అడవులను విక్రయించాలని, బాగు చేసుకొని క్రయ, విక్రయాలు చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. బిలం మరికొన్ని ప్రాంతాలను దర్శించి మొక్కలు నాటారు. కొత్తగా ఎక్కడా అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ విషయం అందిరికీ తెలిసేలా ప్రతి ఒక్కరూ తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ శ్యాంకుమార్,


మొక్కలను నాటుతున్న జిల్లా అటవీ శాఖ అధికారిణి నీలిమాదేవి

మనోజ్‌కుమార్, స్ట్రైకింగ్ ఫోర్స్‌తోపాటు పల్నాడు జిల్లా అడవుల పరిరక్షణ కమిటీ సభ్యులు కె.కుమార్, డి.అబ్రహం, ఎం.నాగరాజు, జాషువా, సీహెచ్ ఆంజనేయులు, టి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్ ద్వారా టికెట్ కొనవచ్చు

డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ

నరసరావుపేట: యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా కావాల్సిన ట్రెయిన్‌లో అన్ రిజర్వ్‌డు టికెట్లను కొనుగోలు చేయవచ్చని డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిజిటల్ కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రైల్వేశాఖ గతంలో ఉన్న ఐదు కిలోమీటర్ల పరిధి నుంచే రిజర్వ్‌డ్ చేయాలనే నిబంధన తొలగించటం జరిగిందన్నారు. ప్రయాణికులు అన్‌రిజర్వ్‌డు టికెట్లు పొందేందుకు రైల్వే వాలెట్ ద్వారా రీచార్జ్‌పై మూడుశాతం బోనస్ పొందవచ్చన్నారు. ప్రయాణికులు క్యూలో ఉండకుండా, వేచి ఉండకుండా సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చునన్నారు.

వాగ్దానాల అమలులో మోసం చేస్తున్న చంద్రబాబు

- బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం
- అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపండి
- జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానాలను అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలపై చేస్తున్న దౌర్జన్యాలను శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్ బాబును కలిసి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెం, తురుమెళ్ల, నరసరావుపేట మండలం ఇక్కుర్తి, యల్లమంద తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్యోగాలకు రావొద్దని, స్వచ్ఛందంగా రాజీనామాలు చేయాలని ఆయా గ్రామాల్లోని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారన్నారు. కొంతమంది చేత రాజీనామాలు చేయించారన్నారు. గతంలో తామెన్నడూ ఇటువంటి వాటికి పాల్పడలేదన్నారు. కలెక్టర్‌చే నియమించబడిన పోస్టులని, వాటికి వైఎస్సార్‌సీపీ రంగు పూసి వారి చేత రాజీనామాలు చేయించటం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎడాపెడా చేసిన ఎన్నో వాగ్దానాలను అమలు చేయటంలో ఇప్పుడు వెనుకాడుతున్నాడన్నారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చి ఈ ఏడాదికి లేనట్లేనని అసెంబ్లీలో మాట్లాడారన్నారు. ప్రతి బిడ్డకి ఇస్తామని చెప్పటంతో చాలామంది పేదలు తమ బిడ్డలను స్కూళ్లలో చేర్పించారన్నారు. మండలిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఈ ఏడాదికి అమలు చేయట్లేదని మాట్లాడటం చాలా అన్యాయం అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఉచిత సిలిండర్లు, రైతు బీమా ఈ ఏడాదికి అమలుచేయట్లేదని చెప్పారన్నారు. తల్లికి వందనం ఇవ్వలేని వారు ప్రతి మహిళకు రూ.15వేలు ఇస్తామనే వాగ్దానం అమలుచేస్తారనే నమ్మకం తమకు లేదన్నారు. చేసిన వాగ్దానాలు అన్నింటిని నెరవేర్చాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సరైన నిధులు తీసుకురావటంలో కూటమి నాయకులు విఫలమయ్యారని పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రానికి సుమారుగా రూ.60వేల కోట్లు ఇస్తే మన రాష్ట్రానికి రూ.15వేల కోట్లు అప్పుగా మాత్రమే ఇస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారన్నారు. బీహార్‌లో కేవలం రోడ్ల నిర్మాణానికి రూ.26వేల కోట్లు ఇచ్చారని, 2,400మెగా ప్రాజెక్ట్‌కు రూ.21వేల కోట్లు, వరదలకు నష్టపోయిన వాటిని బాగుచేసుకునేందుకు రూ.11వేల కోట్లు ఇచ్చారన్నారు. పోలవరం తామే పూర్తిచేస్తామని చెప్పారే కానీ ఎంత ఇస్తామనేది స్పష్టం చేయలేదు అన్నారు. ఏమి సాధించారనే దానిపై కూటమి నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. రాష్ట్రానికి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని తాము కోరుతున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్పారెడ్డి, కేపీ రంగారావు, పొదిలే ఖాజా, జాగర్లమూడి వసంతరావు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

సాంబిరెడ్డిని పరామర్శించిన అంబటి మురళీకృష్ణ



గుంటూరు ఈస్ట్ టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి గుంటూరులోని సాయిభాస్కర్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డిని శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. సాంబిరెడ్డి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. సాంబిరెడ్డికి ధైర్యం చెప్పారు. వైద్యులతో సాంబిరెడ్డికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

డేటా ప్రాసెసింగ్‌పై విస్తృత పరిశోధనలు

ఏఎన్‌యూ(గుంటూరు): డేటా ప్రాసెసింగ్‌పై చేస్తున్న పరిశోధనలు మరింత వేగవంతం కావాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అన్‌లాగ్మేషన్ ఆఫ్ నావిగేషన్ ఎర్త్ అబ్జర్వేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ అనే అంశంపై సాంకేతిక సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడారు. ప్రపంచం మొత్తం డేటా ప్రాసెసింగ్ పై పరిశోధనలు చేస్తున్నాయని భారతదేశం టెక్స్‌టైల్, మ్యానుఫ్యాక్చరింగ్, ఎన్విపీ, జీపీయూ ప్రాసెసర్, మ్యానుఫ్యాక్చరింగ్ మీద దృష్టి సారించిందన్నారు. గణిత శాస్త్ర నైపుణ్యం అందరూ పెంచుకోవాలని సూచించారు. సెమినార్ డైరెక్టర్ ఆచార్య పి.సిద్దయ్య మాట్లాడుతూ సాంకేతికతలను మెరుగుపరిచి సమ్మేళనం చేయడం ద్వారా ఒక ఆచరణార్థమైన వ్యవస్థ సామర్థ్యం పెరుగుతుందన్నారు. విశిష్ట అతిథి బి.ఈ.ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ సిహెచ్ విశ్వనాథన్ మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యం విద్యార్థులు పొందాలంటే హార్డ్వర్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. విఎస్ఎల్ఐ కోర్ టెక్నాలజీపై సాధన చేసి మెలకువలు పెంచుకోవాలని సూచించారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోసం బీఈఎల్‌లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. మరొక విశిష్ట అతిథి ఎఫ్యాట్రానిక్ అధిపతి డి.రామకృష్ణ మాట్లాడుతూ డిజిటల్ అల్గారిదం డెవలప్మెంట్, గణిత శాస్త్ర ప్రావీణ్యం భవిష్యత్తును అంచనా వేయగల స్మార్ట్ సిస్టమ్స్ మీద అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎఫ్ట్రానిక్స్ కంపెనీలు ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సూచించారు . గౌరవ అతిథి, ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ ఇ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల శాటిలైట్ సిస్టం, రిసెప్షన్ డేటా ఎనాలిసిస్ చేసే సాంకేతికతలను పుస్తక పఠనం మీద మాత్రమే ఆధారపడకుండా పోటీపడి నేర్చుకోవాలన్నారు. మరో గౌరవ అతిథి పి.రాఘవేంద్రరావు అడ్వాన్స్‌డ్ నావిగేషన్ గైడ్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ఫర్ మిస్సయిల్స్ స్పెక్ట్రమ్ అనే అంశంపై ప్రసంగించారు. సదస్సుకు వివిధ కళాశాల నుంచి 300 మంది హాజరయ్యారు. గౌరవ అతిథులుగా ఇన్చార్జి రెక్టర్ ఆచార్య రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓ ఎస్ డి ప్రొఫెసర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

విద్యార్థుల భవిష్యత్‌కు నవోదయం

- 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తులకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు
- జనవరి 18న అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: చిలకలూరిపేట సమీపంలోని మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుంది. సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో 80 సీట్లు అందుబాటులో ఉండగా బాలికలకు 30 శాతం సీట్లు, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం 80 సీట్లలో 75 శాతం అంటే 60 సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 20 సీట్లు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయిస్తారు.



మద్దిరాల నవోదయ విద్యాలయం

అంతా ఉచితమే...

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. 6 నుంచి 12వ తరగతి వరకు ఏడు సంవత్సరాలపాటు అత్యుత్తమ విద్య అందిస్తారు. భోజనం, వసతి, యూనిఫామ్, బూట్లు, పుస్తకాలను అందిస్తారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం స్టాఫ్‌నర్స్ అందుబాటులో ఉంటారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

అర్హతలు ఇవే...

- నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి ఒక్కసారి మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాల, బాలికలు అర్హులు.
- 2025-26 విద్యా సంవత్సరం కోసం 6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాల,బాలికలు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4 తరగతులు పూర్తిచేసి ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సదావకాశం



ప్రతిభ ఉన్న గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇదో సదా అవకాశం. తల్లిదండ్రుల కృషి, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే నవోదయలో సులభంగా ప్రవేశం పొందవచ్చు. విద్యా ప్రమాణాల సాధనే లక్ష్యంగా పటిష్ట విద్యా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం.

–నల్లూరి నరసింహారావు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, మద్దిరాల.

ఎన్‌సీసీ కార్యకలాపాలు నిలుపుదల

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కలకలం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటనపై ఎన్‌సీసీ డైరెక్టరేట్ తీవ్రంగా స్పందించింది. ర్యాగింగ్ ఘటన చోటుచేసుకున్న శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో 45 రోజుల పాటు ఎన్‌సీసీ కార్యకలాపాలను సస్పెండ్ చేస్తూ ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి కళాశాలకు ఉత్తర్వులు జారీ అయినట్టు సమాచారం. ర్యాగింగ్‌కు పాల్పడ్డ ఎన్‌సీసీ క్యాడెట్స్, అలాగే కళాశాల ఎన్‌సీసీ అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో 45 రోజుల లోపు తమకు తెలియచేయాలని కోరినట్టు తెలిసింది. అప్పటి వరకు కళాశాలలో ఎన్‌సీసీ కార్యకలాపాలు జరగరాదని ఆదేశాలు కళాశాలకు అందినట్టు సమాచారం.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 505.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): విద్యారంగాన్ని పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించతలపెట్టిన జిల్లా ప్లీనరీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు శుక్రవారం అశోక్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 100 శాతం సీట్లు కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని, ఆరు నెలలుగా బకాయిలు ఉన్న మెస్ చార్జీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేయాలన్నారు. కోడిగుడ్ల సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలని, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలలో అధిక ఫీజులను, పుస్తక అమ్మకాలను నియంత్రించాలి కోరారు. హాస్టళ్ల భవనాలను ఆధునికీకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ రిప్స్ అధ్యక్షులు కుమార్, జిల్లా కన్వీనర్ సుచరిత, జిల్లా ఉపాధ్యక్షులు నవిత, పవన్ కుమార్, జిల్లా సహాయక కార్యదర్శి సుభాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, భగత్ సింగ్, భరత్ చందు, ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

గిడ్డంగుల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.3.36 లక్షల విలువైన పురుగు మందుల విక్రయాలు నిలిపివేత



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంలోని పురుగు మందుల గిడ్డంగుల్లో శుక్రవారం గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సూర్యదేవరపేట, ఏటుకూరురోడ్డులోని పురుగు మందుల గిడ్డంగుల్లో విస్తృత తనిఖీలు కొనసాగాయి. ఏటుకూరురోడ్డులోని ఓ గిడ్డంగిలో జీఎస్‌పీ ఆగ్రోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 'కూల్ స్టార్' అనే పురుగుమందుల వివరాలను స్టాక్ బోర్డులో, స్టాక్ రిజిస్టర్‌లో సక్రమంగా నమోదు చేయలేదు. ఈ మేరకు నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.3.36 లక్షల విలువ చేసే 100 లీటర్ల పురుగు మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి (ఏఓ) ఓ.రమణకుమార్, వ్యవసాయ అధికారి బి.గౌతం ప్రసన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆర్జేడీ

చీరాల అర్బన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్ని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన ఈపూరుపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్, చీరాలలోని జేమ్స్ హైస్కూల్, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రతిభా సామర్థ్యాల్ని తెలుసుకున్నారు. అనంతరం బోధనా నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో పి.సుబ్రమణ్యేశ్వరరావు ఉన్నారు.

ప్రకృతి సేద్యం పెరగాలి

ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి



కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి సేద్యాన్ని పెంచే దిశగా విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి సేద్యం విశిష్టతను వివరించా రు. రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం గుంటూ రు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రకృతి సేద్యం గురించి సూచనలు, సలహాలను ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం అధికారి సత్యనారాయణ, ఎన్ఎఫ్ఏలు, క్షేత్ర స్థాయి ఎంటీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మోడల్ మేకర్లు, డిజిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా నిరుద్యోగభృతి ఇవ్వాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి రూ.3వేలు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇవ్వాలని, వయోపరిమితి 35 ఏళ్ల నుంచి 45 ఏళ్లకు పెంచాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ డీఎస్సీని పాత పద్ధతిలోనే ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా మరిదాసు ఉన్నారు.

10వేల మొక్కలు నాటిన యూనియన్ బ్యాంకు

నరసరావుపేట: భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ ఆదేశాలతో ప్లాంట్ ఫోర్ మదర్ క్యాంపెయిన్‌లో భాగంగా నరసరావుపేట యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10వేల మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసినట్లు ప్రాంతీయ అధికారి మాధురి చెప్పారు. శుక్రవారం స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. దీనికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ బొట్ల రఘుప్రసాదు, కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసప్రసాద్ హాజరయ్యారు. మాధురి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక రాయితీతో యూనియన్ ముస్కాన్ అకౌంట్లు, సుకన్య సమృద్ధి యోజన పథకం, వివిధ రంగాలను ప్రోత్సహించేందుకు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారి మురళీమోహన్, వివిధ శాఖల మేనేజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో మొక్కలు నాటిన మాధురి, బ్యాంకు, కళాశాల అధికారులు

తెనాలి చేరిన రవితేజ మృతదేహం

ఈనెల 18న అమెరికాలో మృతి

తెనాలిరూరల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన రవితేజ భౌతికకాయం శుక్రవారం సాయంత్రం తెనాలి చేరుకుంది. అమెరికా నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న రవితేజ భౌతికకాయాన్ని అంబులెన్స్ ద్వారా తెనాలి తీసుకు వచ్చారు. ఈ నెల 18న అమెరికాలోని టెక్సాస్‌లో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి రవితేజ మృతి చెందిన విజయం తెలిసిందే. రవితేజ తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి జయలక్ష్మి కొడుకుకు మంచి చదువు చెప్పించి పెంచి పెద్ద చేసింది. ఓవైపు చదువుకుంటూనే కోకోకోలా కంపెనీలో ఉద్యోగం చేస్తూ డబ్బులు కూడపెట్టుకున్న రవితేజ ఎంఎస్ కోసం గత ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. అక్కడ టెక్సాస్‌లో ట్రైన్ యూనివర్శిటీలో ఎంఎస్ చేస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18న స్నేహితులతో కలిసి అక్కడ స్విమ్మింగ్‌పూల్‌లో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దాదాపు ఎనిమిది రోజుల అనంతరం శుక్రవారం సాయంత్రం రవితేజ భౌతికకాయం తెనాలి చేరుకుంది. తెనాలిలో భారీ ఊరేగింపుగా రవితేజ భౌతికకాయాన్ని ఐతానగర్‌లోని నివాసానికి తీసుకువెళ్లారు. రజక చెరువు సెంటర్ నుంచి లింగారావు సెంటర్ మీదుగా రవితేజ నివాసానికి రాత్రికి భౌతికకాయం చేరుకుంది. రవితేజ భౌతిక భౌతికకాయాన్ని చూసి తల్లి జయలక్ష్మి, సోదరుడు కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబానికి చెందిన తాము కొడుకు ప్రయోజకుడవుతాడని అమెరికా పంపిస్తే అనుకోని ప్రమాదంలో అతడు మృతి చెందాడంటూ కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి జయలక్ష్మి గుండెల విసేలా రోదించారు. శనివారం ఉదయం రవితేజ భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.


రవితేజ మృతదేహం

గంజాయి విక్రేతకు జరిమానా

తెనాలిరూరల్: గంజాయి విక్రయించిన కేసులో నిందితుడికి జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొల్లిపర మండలం అత్తోటకు చెందిన సోగ భాస్కరరావు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో అతని ఇంటిపై 2019లో అప్పటి కొల్లిపర ఎస్ఐ కడప శ్రీనివాసరెడ్డి ఆకస్మిక దాడులు నిర్వహించి తనిఖీ చేశారు. 400 గ్రాముల గంజాయి లభించింది. దీనిపై కేసు నమోదు చేసి నిందితుని కోర్టులో హాజరుపరిచారు. కేసు శుక్రవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ నిందితునికి రూ.ఐదు వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అల్లంశెట్టి పవన్‌కుమార్ వాదనలు వినిపించారు.